# హోటల్ ఫుడ్.. జాగ్రత్త

## ధనార్జనే ధ్యేయంగా హోటళ్లు, రెస్టారెంట్ల వ్యాపారం


ఫేమస్ అని తింటే.. పేషెంట్ కావడం పక్కా
కంపుకొడుతున్న కిచెన్లు, బొద్దింకలు, ఎలుకలు
పాచిపోయిన మాసం, ఆహారం వేడిచేసి..
రోజుల తరబడి మాసం ఫ్రిజ్‌లో పెట్టి
ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో విస్తుపోయే నిజాలు
నిబంధనలు అతిక్రమిస్తున్న జాబితాలో..
ప్రముఖ వ్యాపార సంస్థలే అధికం
ఓనర్లకు నోటీసులిచ్చి హెచ్చరిస్తున్న అధికారులు




సిటీబ్యూరో, జూన్ 4 (నమస్తే తెలంగాణ ): ఆహార ప్రియులకు, బిర్యానీ లవర్స్‌కు అలర్ట్. వారం మొత్తం కష్టపడి వీకెండ్‌లో ఫ్యామిలీతో కలిసి ఏదైనా రెస్టారెంట్లకు, హోటళ్లకు వెళ్లి తింటున్నారా? పేరొందిన రెస్టారెంట్‌కు వెళ్లి డిమ్ లైటింగ్‌లో కూర్చొని వేడి వేడి బిర్యానీ, దానికి తగ్గట్టుగా చికెన్ లాలిపప్స్.. చికెన్ 65, చికెన్ కబాబ్స్ తింటున్నారా? అయితే జాగ్రత్త.. మీరు తీసుకునే ఆహారం విషం లాంటిదే అని నమ్మక తప్పదు.. మీరు లొట్టలేసుకుంటూ లాగించే ఆహార పదార్థాలు వారాల కొద్దీ నిల్వ ఉంచి మీకు పెడుతున్నారంటే నమ్మక తప్పదు. గ్రేటర్‌లో చాలా మందిలో తమ ఇంటికి ఫ్రెండ్స్ కానీ.., బంధువులు కానీ వచ్చినప్పుడు రొటీన్‌కు భిన్నంగా ఫేమస్ రెస్టారెంట్లు, హోటళ్ల వైపు మొగ్గు చూపుతుంటాం. ఎందుకంటే పది రూపాయలు ఎక్కువైనా సరే ఫుడ్ రుచితో పాటు శుభ్రత, నాణ్యతా ప్రమాణాలు కూడా పాటిస్తారని అందులో తింటే ఆరోగ్యానికి పెద్దగా ప్రమాదం ఉండదన్న గట్టి నమ్మకం. అయితే ఆ గట్టి నమ్మకం కాస్త ఇప్పుడు గుడ్డి నమ్మకమని ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడుల్లో తేలిపోయింది.

### బండారం బట్టబయలు

రుచికి, శుభ్రతకు పెట్టింది పేరు అంటూ ఊదరగొట్టే పెద్ద పెద్ద పేరు మోసిన హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లలో బండారాలు బయటపడుతున్నాయి. కుళ్లిపోయిన మాంసం, ఎక్స్‌పైరీ డేట్ దాటిన ప్రొడక్ట్, కల్తీ మసాలాలు, ఏ మాత్రం నాణ్యత లేని పదార్థాలను వాడటమే కాక, అపరిశుభ్ర వాతావరణంలో ఆహారాన్ని సిద్ధం చేస్తున్నట్లు సోదాల్లో అధికారులు గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ రూల్స్ కూడా సరిగా పాటించడం లేదని అధికారులు వెల్లడించారు. ఇలాంటి పరిస్థితులు ఒకటో, రెండో రెస్టారెంట్లలో కాదండోయ్.. గ్రేటర్‌లో ఫేమస్ అయిన చాలా రెస్టారెంట్లు, హోటళ్లలో ఇదే సీన్ కనిపించడం ఆందోళనకరం.



### ఫుడ్ సేఫ్టీ దాడుల్లో విస్తుపోయే నిజాలు


కోటికి పైగా జనాభా కలిగిన గ్రేటర్‌లో దాదాపు 12 నుంచి 14 వేల వరకు హోటళ్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయిల్ నుంచి మొదలు ఉప్పు వరకు నిర్వాహకులు నాణ్యమైన వాటిని వినియోగించి క్వాలిటీ ఫుడ్‌ను అందించాలి. జీహెచ్ఎంసీ స్టాంప్ వేసిన మాంసాన్ని వాడాలి. కానీ నియమ, నిబంధనలను పక్కన పెట్టేసి ధనార్జనే ధ్యేయంగా హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు వ్యాపారాన్ని సాగిస్తున్నారు. వంటగదులు పరిశ్రుభ్రత పాటించడం లేదు.

### బిర్యానీలో బొద్దింకలు, వెంట్రుకలు

ఫుడ్ తయారీలో ప్రతిదీ కల్తీ వస్తువులను ప్రోత్సహిస్తున్నారు. పైగా పాచిపోయిన ఆహారాన్ని ఫ్రిజ్‌లో పెట్టి తిరిగి వేడి చేసి పెడుతున్నారు. మాంసం అయితే రోజుల తరబడి ఫ్రిజ్‌లో పెట్టి దానికి మాసాలాలు దట్టించి మరుసటి రోజు వాడుతున్నారు. బిర్యానీలో బొద్దింకలు, వెంట్రుకలు వస్తున్న సందర్భాలు లేకపోలేదు. ఈ జాబితాలో చిన్న హోటళ్లు నుంచి బడా హోటళ్ల నిర్వాహకులు ఉంటున్నారు. తరచుగా జీహెచ్ఎంసీకి నిత్యం 10పైగా ఫిర్యాదులు ఇలాంటివే ఎక్కువగా వస్తున్నాయి. మెరుగైన పౌర సేవలు, ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ విభాగం అధికారులు కల్తీరాయుళ్ల భరతం పట్టాలని నిర్ణయించింది.

### గత 15రోజుల్లో పట్టుబడిన వ్యాపార సంస్థల వివరాలు

| వ్యాపార సంస్థ పేరు | ప్రాంతం | పట్టుబడిన ఆహార వివరాలు | సీజ్ చేసిన విలువ |
|---|---|---|---|
| రత్నదీప్ సూపర్‌మార్కెట్ | అమీర్‌పేట్ | నల్లగా మారిన బోర్నవిటా | - |
| రిక్కీన్యూట్రీయంట్ | అమీర్‌పేట్ మెట్రోస్టేషన్ | ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ లేదు | రూ.2600 |
| కేఎఫ్‌సీ | అమీర్‌పేట్ మెట్రోస్టేషన్ | నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ | - |
| కామత్ హోటల్ | సెక్రటేరియట్ | గుర్తింపు లేని బ్రాండ్లకు చెందిన ఆహారపదార్థాలు | రూ.11,270 |
| హోటల్ సుఖ్‌సాగర్ | సైఫాబాద్ | అపరిశుభ్రమైన విధానాల్లో ఆహారం తయారీ | రూ.1425 |
| రాయలసీమ రుచులు | లక్డీకాపూల్ | కాల పరిమితి ముగిసిన వస్తువుల వినియోగం | రూ. 8620 |
| షాగౌస్ | లక్డీకాపూల్ | అపరిశుభ్రమైన విధానాల్లో ఆహారం తయారీ | - |
| హోటల్ సాయి | ఉప్పల్ ఎక్స్ రోడ్ | గుర్తింపు లేని వస్తువుల వినియోగం | రూ. 13,040 |
| మాస్టర్ చెఫ్ | ఉప్పల్ ఎక్స్ రోడ్ | కాల పరిమితి ముగిసిన వస్తువుల వినియోగం | రూ. 5316 |
| సుప్రీత్ బిజినెస్ | సోమాజిగూడ | గుర్తింపు లేని వస్తువుల వినియోగం | రూ.5316 |
| క్రితుంగ రెస్టారెంట్ | సోమాజిగూడ | గుర్తింపు లేని వస్తువుల వినియోగం | రూ.4698 |
| యామ్ రెస్టారెంట్ | రాజ్‌భవన్ | గుర్తింపు లేని వస్తువుల వినియోగం | — |
| లాబోనెల్ ఫైన్ | రోడ్ నెం. 1 | లేబులింగ్ సమస్య | రూ.740 |
| ఇస్‌కాద్ ఫుడ్స్ | రోడ్ నెం. 12 | కాల పరిమితి ముగిసిన వస్తువుల వినియోగం | రూ. 881 |
| అముక్తా | మాదాపూర్ | కాల పరిమితి ముగిసిన వస్తువుల వినియోగం | రూ.56,000 |
| బాహుబలి కిచెన్ | మాదాపూర్ | అపరిశుభ్రమైన కిచెన్ పరిసరాలు | |
| ప్యారడైజ్ ఫుడ్ | మెహిదీపట్నం | — | — |
| మహారాజా ఫుడ్స్ | లక్డీకాపూల్ | గుర్తింపు లేకుండా హోటల్ నిర్వహణ | రూ.11,600 |
| బార్బిక్యూ నేషన్ | ఏఎస్‌రావు నగర్ | గుర్తింపు లేని ఆహార పదార్థాల వినియోగం | |
| సాస్వత్ | సైనిక్‌పురి | కాల పరిమితి ముగిసిన పదార్థాల వినియోగం | |
| భాగ్యనగర్ ఆయిల్ | కాటేదాన్ | అపరిశుభ్రమైన ఆహారాల తయారీ | |
| అంబికా ఆయిల్ | కాటేదాన్ | అపరిశుభ్రమైన ఆహారాల తయారీ | |
| కేడీయా ఆగ్రో | కాటేదాన్ | అపరిశుభ్రమైన ఆహారాల తయారీ | |
| నిమ్రా కేఫ్ | చార్మినార్ | అపరిశుభ్రమైన ఆహారాల తయారీ | |
| ఆరేబీయానా | చార్మినార్ | అపరిశుభ్రమైన ఆహారాల తయారీ | |
| హోటల్ షాదాబ్ | మదీనా | అపరిశుభ్రంగా ఆహారాల తయారీ | రూ. 25000 |
| ఫుడ్ లింక్ | రోడ్ నెం.1 | అపరిశుభ్రంగా ఆహారాల తయారీ | |
| హాంప్‌షైర్ ప్లాజా | లక్డీకాపూల్ | అపరిశుభ్రంగా ఆహారాల తయారీ | రూ. 4295 |
| ఫిష్‌ల్యాండ్ | లక్డీకాపూల్ | అపరిశుభ్రమైన రీతిలో ఆహారాల తయారీ | |
| హోటల్ అశోక | లక్డీకాపూల్ | అపరిశుభ్రమైన ఆహారాల తయారీ | రూ.12920 |



### ఫంగస్ ఉన్న పదార్థాలు, బొద్దింకలు

లక్డీకాపూల్‌లోని అశోక హోటల్, ఫిష్ ల్యాండ్‌లో తనిఖీలు నిర్వహించారు. చికెన్ లెగ్ బోన్ లెస్ (5 కిలోలు), లిక్విడ్ కారామెల్ కలర్, గ్రీన్ పప్పు (10 కిలోలు) వంటి ఆహార పదార్థాలు పాడైనట్లు గుర్తించారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ లేబులింగ్ నిబంధనలను పాటించకుండా ఉన్న జీడిపప్పును స్వాధీనం చేసుకున్నారు. ఎర్రమాంసం నిల్వ చేసే ప్రాంతంలో బొద్దింకలు ఉన్నట్లు గుర్తించారు. రిఫ్రిజిరేటర్ లోపల నిల్వ చేయబడిన పదార్థాల్లో ఫంగస్ ఉన్నట్లు తేల్చారు. లక్డీకాపూల్ ఫిష్ ల్యాండ్ హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. కిచెన్ ప్రాంగణంలో ఎలుకల బెడత ఉన్నట్లు గుర్తించారు. వంటగదిలో దొరికిన సింథటిక్ ఫుడ్ కలర్‌లను అక్కడే వదిలేశారు. డస్ట్‌బిన్లకు మూతలు లేవని గుర్తించి చర్యలు తీసుకున్నారు. ఆహార నాణ్యత ప్రమాణాల విషయంలో అనుమానాలుంటే జీహెచ్ఎంసీ టోల్ ఫ్రీ నంబరు 040- 2111 1111లో సంప్రదించాలని ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారి బాలాజీ కోరారు.

### ఫుడ్ సేఫ్టీ దాడుల్లో పేరొందిన హోటల్స్, రెస్టారెంట్లు

ఈ నేపథ్యంలోనే గడిచిన రెండు నెలలుగా నిబంధనలకు అతిక్రమించి వ్యాపారాలు చేస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లు, ఐస్ క్రీం పార్లర్లపై చర్యలు తీసుకున్నారు. దాదాపు 75కు పైగా వ్యాపార సంస్థలపై చర్యలు తీసుకుంటే అత్యధికంగా పేరొందిన హోటళ్లు, రెస్టారెంట్లు ఉండడం ఆందోళన కలిగించే అంశం. రెండు రోజుల క్రితం లక్డీకాపూల్‌లోని ఆశోక హోటల్, ఫిష్ ల్యాండ్ హోటల్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు.

## ఐటీ కారిడార్‌లో మహిళ రక్షణకు హైసియా చర్యలు

**6న ఇన్ఫోసిస్ గచ్చిబౌలి క్యాంపస్‌లో సమావేశం**

సిటీబ్యూరో, జూన్ 4(నమస్తే తెలంగాణ): ఐటీ కారిడార్‌లో పని చేస్తున్న మహిళల రక్షణకు హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్ ప్రెన్యూయర్స్ అసోసియేషన్ (హైసియా) ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ)తో కలిసి 'మీ భద్రత మీ చేతుల్లోనే..' అనే నినాదంతో ఈ నెల 6వ తేదీన గచ్చిబౌలిలోని ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో సమావేశాన్ని నిర్వహిస్తోంది. మహిళ, శిశు సంక్షేమ శాఖ, పోలీసు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొని మహిళ రక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచిస్తారని, వాటిన్నంటినీ అమలు చేసేందుకు హైసియా అవసరమైన చర్యలు తీసుకుంటుందని హైసియా ప్రతినిధి తెలిపారు.

## 14న స్టార్టప్ ఫౌండర్స్ రౌండ్ టేబుల్ సమావేశం

సిటీబ్యూరో, జూన్ 4(నమస్తే తెలంగాణ): ఔత్సాహిక స్టార్టప్ నిర్వాహకులను ప్రోత్సహించేందుకు గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీలోని ఫౌండర్స్ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని సీఐఈ ఇంక్యుబేటర్ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 18న ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని ఓజస్ కాన్ఫరెన్స్ హాలులో సమావేశం ఉంటుందని, కొత్త ఆలోచనలతో స్టార్టప్‌లను ప్రారంభించిన వారికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించేందుకు వ్యాపార వేత్తలు, కార్పొరేట్ సంస్థల నిర్వాహకులు, వెంచర్ క్యాపిటలిస్టులు ఆసక్తిగా ఉన్నారు. ఔత్సాహిక స్టార్టప్ నిర్వాహకులు సమావేశంలో పాల్గొనేందుకు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

## గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానంలో హెచ్‌సీయూ

కొండాపూర్, జూన్ 4: గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మెరుగైన స్థానంలో నిలవడం సంతోషకరమైన విషయమని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ బీజే రావు అన్నారు. క్యూఎస్ వరల్డ్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో 'సిటియేషన్స్ ఫర్ ఫ్యాకల్టీ' సూచికలో 335 ర్యాంక్‌లో నిలిచిందన్నారు. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో 2025వ సంవత్సరానికి 801–850 స్థానంలో నిలిచిందన్నారు. గత సంవత్సరం సిటియేషన్స్ ఫర్ ఫ్యాకల్టీ సూచికలో 372వ స్థానంలో ఈ ఏడాది మరింత మెరుగైన ర్యాంక్ సాధించిందన్నారు. దీంతో పాటుగా మిగతా విభాగాల్లో మెరుగైన స్థానంలో నిలిపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 106 లోకేషన్స్‌లోని 5,663 ఇనిస్టిట్యూషన్స్, 1503 ఫీచర్డ్ ఇనిస్టిట్యూషన్స్, ఇండియాలోని 46 ఇనిస్టిట్యూషన్స్‌లో హెచ్‌సీయూ మెరుగైన ర్యాంక్‌ను సాధించినట్లు తెలిపారు.

## ఎంకే హాస్టల్‌కు అడ్మిషన్ల ఆహ్వానం

కాచిగూడ, జూన్ 4: విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని 2024–25వ సంవత్సరం ప్రొఫెషనల్ కోర్సుల్లో చదివే విద్యార్థుల హాస్టల్ అడ్మిషన్లకు ఆహ్వానిస్తున్నట్లు మున్నూరు కాపు విద్యార్థి ట్రస్టు బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎం.ఆర్.వెంకట్ రావు తెలిపారు. మంగళవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపు తల్లిదండ్రుల విజ్ఞప్తుల మేరకు ప్రస్తుత అకాడమిలో ఎం.టెక్, ఎమ్మెస్సీ, ఎం.కామ్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంబీబీఎస్, ఎం. ఫార్మసీ, బీ. ఫార్మసీ, బీ టెక్, తదితర ప్రొఫెషనల్ కోర్సుల్లో చదివే తెలంగాణలోని అన్ని జిల్లాల విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రంతో ఈ నెల 7వ తేదీ నుంచి 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మున్నూరు కాపు, ఇతర విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇతర వివరాల కోసం ఫోన్ నం. 040–2465 8160, 2465 7404లో సంప్రదించాలని ఆయన కోరారు.




సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం దోమలగూడలోని ఏవీ కాలేజీలో ఏర్పాటు చేసిన ఓట్ల కౌంటింగ్ కేంద్ర వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది.

## గ్రేటర్‌లో వికసించిన కమలం

**మూడు స్థానాల్లో బీజేపీ, ఒకటి ఎంఐఎం**
**సికింద్రాబాద్, హైదరాబాద్ సిట్టింగ్ అభ్యర్థుల స్థానాలు పదిలం**



సిటీబ్యూరో, జూన్ 4(నమస్తే తెలంగాణ) : సుదీర్ఘ కాలంపాటు సాగిన ఎన్నికల పర్వానికి తెర పడింది. గ్రేటర్‌లో ఉన్న హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల్లో మూడు స్థానాలను బీజేపీ కైవసం చేసుకోగా, హైదరాబాద్ స్థానాన్ని మరోసారి ఎంఐఎం అధినేత అసదుద్దీన్ నిలుపుకొన్నారు. ఇక గ్రేటర్‌లో బీజేపీ బలాన్ని పెంచుకోగా అన్ని స్థానాల్లోనూ బీజేపీ అభ్యర్థులు మంచి ఓట్లను రాబట్టుకుని కాంగ్రెస్ పార్టీకి అవకాశం లేకుండా చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి ఈటల రాజేందర్, సికింద్రాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి గెలిచారు. కిషన్ రెడ్డి 49వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందగా.. చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి లక్షా 72వేలు, మల్కాజిగిరిలో ఈటల రాజేందర్ 3 లక్షల 91వేలు, హైదరాబాద్‌లో అసదుద్దీన్ ఒవైసీ 3లక్షల 3వేల ఓట్లతో గెలుపొందారు.

### హైదరాబాద్‌లో మొదట బీజేపీ ఆధిక్యం

హైదరాబాద్ లోక్ సభ స్థానంలో ఓట్ల లెక్కింపు ఉత్కంఠగా సాగింది. మొదటి రెండు, మూడు రౌండ్లలో ఆధిక్యం కనబర్చిన బీజేపీ, ఆ తర్వాత ఎంఐఎం క్రమంగా ఓట్లను కొల్లగొట్టింది. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ 61శాతం ఓట్లు దక్కించుకోగా.. బీజేపీ 29.98 శాతం ఓట్లతో రెండో స్థానంలో నిలిచింది. అదేవిధంగా కాంగ్రెస్ సిట్టింగ్ స్థానమైన మల్కాజిగిరి స్థానాన్ని భారీ ఓట్ల తేడాతో చేజార్చుకున్నది.

### పార్లమెంట్ స్థానాల వారీగా నమోదైన ఓట్లు (శాతం)

| అభ్యర్థి | పార్టీ | ఓట్ల శాతం |
|---|---|---|
| **హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం** | | |
| అసదుద్దీన్ | ఎంఐఎం | 61.28 |
| మాధవీలత | బీజేపీ | 29.98 |
| సమీర్ | కాంగ్రెస్ | 5.83 |
| **సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం** | | |
| కిషన్ రెడ్డి | బీజేపీ | 45.15 |
| దానం నాగేందర్ | కాంగ్రెస్ | 40.38 |
| పద్మారావు గౌడ్ | బీఆర్ఎస్ | 12.37 |
| **చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం** | | |
| కొండా విశ్వేశ్వర్‌రెడ్డి | బీజేపీ | 48.34 |
| గడ్డం రంజిత్ | కాంగ్రెస్ | 38.02 |
| కాసాని జ్ఞానేశ్వర్ | బీఆర్ఎస్ | 10.68 |
| **మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం** | | |
| ఈటల | బీజేపీ | 51.25 |
| పట్నం సునీతారెడ్డి | కాంగ్రెస్ | 31.0 |
| రాగిడి లక్ష్మారెడ్డి | బీఆర్ఎస్ | 15.54 |

## తొలి తరం ఉద్యమకారుల విస్మయం బాధాకరం

**కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అలనాటి ఉద్యమకారుడు 1969 ఉద్యమ జేఏసీ నేత గోపాలరావు**



కాచిగూడ, జూన్ 4: తొలి తెలంగాణ ఉద్యమం (1969)లో పాల్గొన్న ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి ఆహ్వానించకపోవడం బాధాకరమని 1969 తెలంగాణ విద్యార్థి జేఏసీ కన్వీనర్ ఎస్.గోపాలరావు ఆరోపించారు. నింబోలి అడ్డా కార్యాలయంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడి, ప్రస్తుతం బతికున్న ఆనాటి ఉద్యమకారులు ఎస్.గోపాల్ రావు, బొక్కా వెంకట్ రెడ్డి, బాలాచారి, సూర్‌దాస్ రెడ్డి, ఠాకూర్ హృదయ్ నాథ్ సింగ్, తదితరులతో కూడిన జాబితాను సీఎం కార్యాలయం, గాంధీభవన్‌లో అందజేశామని, ఐనప్పటికి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్పందన లేదని విమర్శించారు. ఉద్యమకారులు 75 ఏండ్లకు పైగా ఉండటంతో అనేక అనారోగ్య సమస్యలు, ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నారని, వారి సేవలను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థి కుటుంబాలకు పెన్షన్, ఇండ్ల స్థలాలు, ఉచిత వైద్యాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

## వైశ్య టాపర్ల నుంచి దరఖాస్తులకు ఆహ్వానం

ముషీరాబాద్, జూన్ 4: అవోపా బ్యాంక్ చాప్టర్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో ఈఏపీ సెట్, నీట్, జేఈఈ అడ్వాన్స్–24 ఫలితాల్లో తొలి వెయ్యి ర్యాంకులు సాధించిన వంద మంది తెలుగు రాష్ట్రాల ఆర్యవైశ్య విద్యార్థులకు స్వర్ణ పతకాలు అందించి సత్కరించనున్నట్లు చాప్టర్ సంస్థ అధ్యక్షుడు పీవీ రమణయ్య తెలిపారు. వెయ్యి లోపు ర్యాంకులు సాధించిన ఆర్య వైశ్య విద్యార్థులు https//forms.gle/4DRAJT2L7Qr8v5nJ8 వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఈ నెల 20వ తేదీలోగా పీవీ రమణయ్య, ఫ్లాట్ నం. 3–81/202 విజేత విహార్ అపార్టుమెంట్ చైతన్యపురి హైదరాబాద్ చిరునామాకు దరఖాస్తులు పంపాల్సిందిగా తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 94419 28528లో సంప్రదించాల్సిందిగా కోరారు.

## అభ్యర్థులు నచ్చకే 'నోటా'పై నొక్కారు.!

సిటీబ్యూరో, జూన్ 4 (నమస్తే తెలంగాణ ): ఎన్నికల సంస్కరణల్లో భాగంగా వచ్చిన 'నోటా' ("None of the Above ) ఆప్షన్ అస్త్రాన్ని పార్లమెంట్ ఎన్నికల్లో భారీగానే ఓటర్లు సద్వినియోగం చేసుకున్నారు. అభ్యర్థులెవరూ నచ్చని పక్షంలో..వారెవరికీ ఓటు వేయడం లేదని పేర్కొనే ఈ నోటాకు ఈవీఎం పరికరాల్లో స్థానం దక్కింది. ప్రజల మనోభీష్టాలను గుర్తించేందుకు.. వారికి ఓటు వేయడం ఇష్టం లేదని చెప్పే స్వేచ్ఛను కల్పించేందుకు ఈ ఆప్షన్‌కు ప్రతి ఎన్నికల్లో అవకాశం కల్పించారు. ఇందులో భాగంగానే పార్లమెంట్‌తో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థులు నచ్చలేదంటూ నోటాపై నొక్కారు. అత్యధికంగా మల్కాజిగిరి పార్లమెంట్‌లో 13206, చేవెళ్లలో 6144, సికింద్రాబాద్‌లో 5166, హైదరాబాద్ పార్లమెంట్‌లో 2906 మంది నోటాను వినియోగించుకోగా, కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 950 మంది నోటాను వినియోగించారు. దీంతో ఈ ఎన్నికల్లో నోటాకు మరోమారు ప్రాధాన్యత ఏర్పడింది.

## జయ హనుమంత గ్రంథావిష్కరణ




గ్రంథాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి

ముషీరాబాద్, జూన్ 4: చిక్కడపల్లి త్యాగరాయ గానసభ 58వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం 'జయ హనుమంత' గ్రంథావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి ముఖ్య అతిథిగా విచ్చేసి జయ హనుమంత గ్రంథాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు బాల సుష్మాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన వీణా వాదన, సంగీత కార్యక్రమాలు, తులసీ శిష్య బృందం నృత్య ప్రదర్శనలు రంజింపచేశాయి. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, బండి శ్రీనివాస్, ఉష పాల్గొన్నారు.